# హీరో.. విలన్ రెండూ బన్నీనే?



స్టార్ హీరోలు ద్విపాత్రాభినయాలు చేయడం మామూలే. అయితే.. ఆ రెండు పాత్రల్లో ఒకటి విలన్ పాత్ర అయితే.. అది నిజంగా చెప్పుకోదగ్గ విషయమే. ఇలాంటి ప్రయోగాలు చేసిన హీరోలు దక్షిణాదిలో చాలా తక్కువమంది. పాత రోజుల్లో ఎన్టీఆర్, కృష్ణ ఈ తరహా సాహసాలు చేశారు. ప్రస్తుతం ఉన్న హీరోల్లో 'వాలి' సినిమాలో అజిత్, 'జై లవ కుశ'లో తారక్ ఈ తరహా పాత్రలు చేశారు. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఆ సాహసాన్ని అల్లు అర్జున్ కూడా చేయబోతున్నారట. తమిళ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో బన్నీ ఓ సినిమాలో నటించనున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో ఆయన తొలిసారి ద్విపాత్రాభినయం చేస్తున్నారనే వార్త ఇప్పటికే ఫిల్మ్ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నది. వాటిలో ఓ పాత్ర పూర్తి నెగెటివ్ షేడ్స్‌తో ఉంటుందట. కథలో విలన్ కూడా ఆ పాత్రే అని సమాచారం. అంటే హీరో బన్నీనే.. విలనూ బన్నీనే. ఆ సినిమాకు సంబంధించిన కథా చర్చలు ప్రస్తుతం దుబాయ్‌లో జరుగుతున్నాయట. త్వరలోనే బన్నీ ఇండియా తిరిగి వస్తారని తెలుస్తున్నది. ఆయన వచ్చాక ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటనను విడుదల చేస్తారట.

# ఓపెనింగ్ మిస్ కావొద్దు!



'మాస్ సినిమాలు చేస్తున్నా కానీ..రా అండ్ రస్టిక్‌గా ఉండే సినిమాలు చేసి చాలా రోజులైంది. ఆ లోటుని తీర్చే చిత్రమిది. యాక్షన్‌తో పాటు కదిలించే భావోద్వేగాలుంటాయి' అని అన్నారు అగ్ర హీరో విక్రమ్. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'వీర ధీర శూర'. ఎస్.యు.అరుణ్ కుమార్ దర్శకుడు. ఎస్.జె.సూర్య, సూరజ్, దుషార విజయన్ కీలక పాత్రల్ని పోషించారు. ఈ నెల 27న విడుదలకానుంది. నైజాం ఏరియాలో మైత్రి మూవీ మేకర్స్ విడుదల చేస్తున్నది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో విక్రమ్ మాట్లాడుతూ.. ఈ సినిమాలో సూర్యతో కలిసి నటించడం మరచిపోలేని అనుభూతినిచ్చిందని, ఆయన ద్వారా చాలా విషయాలు తెలుసుకున్నానని, సినిమాలో ఓపెనింగ్‌ను ఎవరూ మిస్ కావొద్దని, తొలి సన్నివేశం నుంచే కథ మొదలవుతుందని తెలిపారు. 'రంగస్థలం' వంటి రా అండ్ రస్టిక్ సినిమా ఇదని, తన పాత్ర చాలా కొత్తగా ఉంటుందని ఎస్‌జే సూర్య పేర్కొన్నారు. 'మహారాజ' తర్వాత తమ సంస్థ తెలుగులో చేస్తున్న సినిమా ఇదని నిర్మాత ఎన్వీ ప్రసాద్ చెప్పారు.

# ఓవర్ యాక్షన్ చేసేది వాళ్లే..



'వివక్ష అనేది అన్ని రంగాల్లోనూ ఉంది. అయితే.. అది ఒక్కో రంగంలో ఒక్కో విధంగా ఉంటుంది. పరిస్థితుల్ని బట్టి వాటి స్థాయి ఉంటుంది.' అంటున్నారు టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డే. సినీ పరిశ్రమలో స్త్రీలపై వివక్ష గురించి ఓ విలేకరి అడిగి ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ పై విధంగా స్పందించారు. ఇంకా ఆమె మాట్లాడుతూ 'హీరోల వ్యానిటీ వ్యాన్‌ని సెట్‌కు పక్కనే ఉంచుతారు. మిగతా అందరివీ దూరంగా ఉంటాయి. మేం ఏ విధమైన కాస్ట్యూమ్స్ ధరించినా.. మా వ్యానిటీ వ్యాన్ నుంచి సెట్ వరకూ, మళ్లీ సెట్ నుంచి మా వ్యాన్ వరకూ నడుచుకుంటూ తిరగాల్సిందే. ఒక్కోసారి బరువైన లెహంగాలు ధరించినప్పుడైతే వాటిని ఈడ్చుకుంటూ వెళ్లాలి.. షాట్ అయ్యాక మళ్లీ అలాగే వ్యాన్ దగ్గరకు రావాలి. అవి చూడ్డానికి బాగానే ఉన్నా.. వాటిని మోసే మాకు తెలుస్తుంది బాధ.' అంటూ చెప్పుకొచ్చింది పూజా. ఇంకా చెబుతూ 'క్యారెక్టర్ కోసం అంత కష్టపతాం. కానీ ఒక్కోసారి పోస్టర్‌పై మా పేర్లు కూడా ఉండవ్. సినిమా అనేది సమిష్టి కృషి. ఈ విషయం వారికెందుకు అర్థం కాదు?. లవ్‌స్టోరీల్లో కూడా హీరోయిన్లకు గుర్తింపు ఇవ్వరు. నిజానికి అందరూ నా అభిమాన హీరోలే. వారందరూ మాతో బాగానే ఉంటారు. చుట్టూ ఉన్నవాళ్లే ఓవర్ యాక్షన్ చేస్తారు.' అంటూ మనసును ఆవిష్కరించింది పూజా హెగ్డే.

# ఇక్కడి ప్రేమ మరెక్కడా దొరకదు!



'47 ఏళ్ల సినీ ప్రయాణంలో తెలుగు చిత్రసీమతో ఎంతో అనుబంధం ఏర్పడింది. అక్కినేని నాగేశ్వరరావు వంటి లెజెండ్‌తో నటించే అవకాశం దక్కింది. తెలుగు ప్రేక్షకులు చూపించే ప్రేమ మరెక్కడా దొరకదు. దేశంలోనే అత్యుత్తమ ఇండస్ట్రీగా టాలీవుడ్ అలరారుతున్నది' అన్నారు మలయాళ అగ్ర నటుడు మోహన్‌లాల్. ఆయన కథానాయకుడిగా పృథ్వీరాజ్ సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఎల్2: ఎంపురాన్'. సూపర్‌హిట్ మూవీ 'లూసిఫర్'కు సీక్వెల్ ఇది. ఈ నెల 27న పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ పొలిటికల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రాన్ని అగ్ర నిర్మాత దిల్ రాజు తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా మోహన్‌లాల్ మాట్లాడుతూ..తాము 'లూసిఫర్' చిత్రాన్ని మూడు భాగాలుగా తీయాలని ముందే ప్లాన్ చేశామని, ఈ సినిమా హిట్ అయితే మూడో భాగాన్ని తెరకెక్కిస్తామని తెలిపారు. ఇది ఒరిజినల్ తెలుగు సినిమా అనే అనుభూతిని అందిస్తుందని, అద్భుతమైన క్వాలిటీతో డబ్బింగ్ చేశామని, రెండో పార్ట్‌ను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నామని, బుకింగ్ ఓపెన్ చేసిన వెంటనే హౌస్‌ఫుల్స్ అవుతున్నాయని చిత్ర దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ పేర్కొన్నారు. ఈ సినిమా గ్రాండియర్‌గా తెరకెక్కించారని, తప్పకుండా తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉందని దిల్ రాజు తెలిపారు.



# ఊరిని రక్షించే ఓదెల మల్లన్న

'ఓ పల్లెటూరి కథను ఎక్సైయిటింగ్‌గా చెప్పడం థ్రిల్లింగ్‌గా అనిపిస్తుంది. ఇది ఈజీ జోనర్ కాదు. ఇందులో భైరవి క్యారెక్టర్ చేయడం అదృష్టంగా భావిస్తున్నా. ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించే సినిమా అవుతుంది' అని చెప్పింది తమన్నా. ఆమె నాగసాధువుగా ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఓదెల-2'.అశోక్‌తేజ దర్శకుడు. ఏప్రిల్ 17న ప్రేక్షకుల ముందుకురానుంది. శనివారం జరిగిన ప్రెస్‌మీట్‌లో రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మూవీ క్రియేటర్, ప్రముఖ దర్శకుడు సంపత్‌నంది మాట్లాడుతూ 'ఓదెల సినిమా నాకు ఓ ఎమోషన్. నేను ఆ ఉర్లో పుట్టిపెరిగాను. ఎంతో ప్రేమతో, గౌరవంతో ఈ సినిమా తీశాను. ఓదెల గ్రామంలో పెద్ద కష్టం వస్తే ఊరి ఇలవేల్పు ఓదెల మల్లన్న నాగసాధువు పాత్ర ద్వారా ఎలా పరిష్కరించాడన్నదే చిత్ర కథాంశం. కథ, కంటెంట్, విజువల్స్ అద్భుతంగా ఉంటాయి. భైరవి పాత్రలో తమన్నా అభినయం, అజనీష్ లోక్‌నాథ్ మ్యూజిక్ ప్రధానాకర్షణలుగా నిలుస్తాయి' అన్నారు. కుంభమేళాలో రిలీజ్ చేసిన టీజర్‌కు అద్భుతమైన స్పందన లభిస్తున్నదని నిర్మాత డి.మధు తెలిపారు. హెబ్బాపటేల్, వశిష్ట ఎన్ సింహ, యువత, నాగ మహేష్ తదితరులు నటించిన ఈ చిత్రానికి నిర్మాణం : మధు క్రియేషన్స్, సంపత్‌నంది టీమ్ వర్క్స్, నిర్మాత: డి.మధు, క్రియేటర్: సంపత్‌నంది, దర్శకత్వం: అశోక్‌తేజ.

# అమెరికాలో తెలుగు సంబరాలు



ఉత్తర అమెరికా తెలుగు సంఘం (NATS) 8వ తెలుగు సంబరాల ఈవెంట్ జూలై 4 నుంచి 6 వరకూ అమెరికాలోని టంపాలో ఘనంగా జరుగనున్నాయి. ఈ సందర్భంగా NATS 8వ తెలుగు సంబరాలు కార్యక్రమ కర్టెన్ రైజర్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈవెంట్ కన్వీనర్, పూర్వపు ఛైర్మన్ శ్రీనివాస్ గుత్తికొండ, నాట్స్ ఛైర్మన్ ప్రశాంత్ పిన్నమనేనిలతో పాటు నటి జయసుధ, ఆమని, దర్శకులు హరీశ్‌శంకర్, మెహర్‌రమేశ్, సంగీత దర్శకుడు తమన్, గీత రచయితలు చంద్రబోస్, రామజోగయ్యశాస్త్రి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జూలైలో జరిగే ఈ సంబరంలో పలువురు తెలుగు కవులు, కళాకారులు, నటీనటులు, ఇతర రంగాల ప్రముఖులు హాజరవుతారని, దాదాపుగా పదివేల మంది ఈ సంబరాల్లో పాల్గొంటారని, రాబోయే 15ఏండ్లలో ఎలా ముందుకెళ్లాలో ముందే ప్రణాళికలు వేసుకున్నామని నాట్స్ ఛైర్మన్ ప్రశాంత్ పిన్నమనేని తెలిపారు.

# కాంట్రాక్ట్ చదివి షాకయ్యా..



సినిమా ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్‌పై రెండేళ్ల క్రితం పెద్ద పోరాటమే జరిగింది. పరిశ్రమలో స్త్రీలకు రక్షణ లేదంటూ కొందరు నటీమణులు ఉద్యమాలే చేశారు. అయితే.. అందుకు భిన్నమైన అనుభవాన్ని కెరీర్ తొలినాళ్లలో కథానాయిక నిధి అగర్వాల్ చవిచూశారు. ఇటీవల ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. ఆ అనుభవాన్ని స్వయంగా వెల్లడించారు. 'మున్నా మైకేల్' నటిగా నా తొలి సినిమా. టైగర్ ష్రాఫ్ కథానాయకుడు. ఆ సినిమాకు ఓకే చెప్పిన తర్వాత ఆ టీమ్ నాతో ఒక కాంట్రాక్ట్‌పై సంతకం చేయించుకుంది. అయితే.. నేను చదవకుండా సంతకం చేశాను. తీరా కొన్ని రోజుల తర్వాత ఆ కాంట్రాక్ట్‌లో ఏముందో తెలిసింది. నిజంగా ఆశ్చర్యపోయా. అందులో సినిమాకు సంబంధించిన విధివిధానాలతోపాటు 'నో డేటింగ్' అనే షరతు కూడా పెట్టారు. సినిమా పూర్తయ్యేంతవరకూ నేను హీరోతో డేట్ చేయకూడదు అనేది దాని సారాంశం. నటీనటులు ప్రేమలో పడితే వర్క్‌పై దృష్టి పెట్టరని వారి ఉద్దేశ్యం. ఆ సంఘటన సినిమా పరిశ్రమపై నాకు గౌరవాన్ని పెంచింది. అవసరాల కోసమే కాదు. అభిరుచితో సినిమాలు తీసేవాళ్లు ఇండస్ట్రీలో ఉంటారు.' అంటూ గతాన్ని నెమరు వేసుకున్నారు నిధి అగర్వాల్.



# యువజంట ప్రణయగీతం

విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ 'సంతాన ప్రాప్తిరస్తు'. సంజీవ్‌రెడ్డి దర్శకుడు. మధుర శ్రీధర్‌రెడ్డి, నిర్వి హరిప్రసాద్‌రెడ్డి నిర్మాతలు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ రాజా, ఏక్ మినీ కథ చిత్రాలకు స్క్రీన్‌ప్లే అందించిన షేక్ దావూద్‌జీ ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. త్వరలో చిత్రం విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాలోని పాటను ఈ నెల 26న మేకర్స్ విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని శనివారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. 'నాలో ఏదో..' అంటూసాగే ఈ రొమాంటిక్ గీతాన్ని శ్రీజో రాయగా, సునీల్ కశ్యప్ స్వరపరిచారు. దినకర్ కల్వాల, అదితి భావరాజు ఆలపించారు. హీరోహీరోయిన్ల మధ్య వచ్చే ఈ రొమాంటిక్ సాంగ్ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. వెన్నెల కిశోర్, అభినవ్ గోమటం, మురళీధర్‌గౌడ్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి మాటలు: కల్యాణ్ రాఘవ్, కెమెరా: మహిరెడ్డి పండుగుల.








